సాక్షి విశాఖపట్నం

బుధవారం । 30 । అక్టోబర్ । 2024



భళా..బాల

'ఫ్యూచర్ ఆన్-2024'పేరుతో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జోనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ మంగళవారం ముగిసింది. 8లో



పోలీసులకు పదోన్నతులు

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు పోలీసులకు పదోన్నతులు లభించాయి. వారికి ఆర్డర్లను సీపీ అందించారు. 8లో



రెవెన్యూ సేవలు విస్తృతం

రెవెన్యూ సేవలను మరింత విస్తృతం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులకు సూచించారు. 8లో

వలపు వల
జేబు గుల్ల

బార్లో డ్రింక్ ఆఫర్ల పేరిట 'అమ్మాయి'లతో చీర్స్

కనీసం రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు బిల్లు

- అధికార పార్టీ ముఖ్యులతో బార్ యజమానికి సన్నిహిత సంబంధాలు
- వాటా పేరుతో రూ.2 కోట్లు సమర్పించుకున్న ఓ ఎమ్మెల్యే
- తీరా చెల్లింపుల తర్వాత వాటా లేదని మెలిక
- ఎవరికీ చెప్పుకోలేక కుమిలిపోతున్న ప్రజాప్రతినిధి



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

నగర శివారు బీచ్కు దగ్గరలోని ఓ బార్కు వెళ్లారా మీ పని అంతే. మీరు రెండు పెగ్గులు వేద్దామని ఆర్డర్ ఇస్తే.. డ్రింక్ ఆఫర్ ఇస్తున్నామంటూ అందమైన అమ్మాయిలు మీ వద్దకు వస్తారు. మాటలతో మాయచేసి వలపు వాకిట్లోకి తీసుకెళ్తారు. మొదటగా ఒక పెగ్గు ఇప్పించి.. ఆ తర్వాత తమకూ డ్రింక్ ఆఫర్ చేయాలంటూ అడుగుతారు. ఆ మత్తు మాయలో నుంచి వలపు కౌగిల్లో నుంచి తేరుకునేలోపు బార్ సిబ్బంది వచ్చి మీ చేతిలో వేల రూపాయల బిల్లు పెడతాడు. కనీసం రూ.5 వేల నుంచి రూ.10 వేల మేర బిల్లు ఉంటుంది. ఇదంతా నేనెప్పుడు ఖర్చు చేశానని మీరు తలపట్టుకునే లోగానే ముక్కు పిండి మరీ ఆ బిల్లు వసూలు చేస్తారు. అయితే రెగ్యులర్గా వచ్చే మందుబాబులను కాకుండా.. బయట నుంచి వచ్చే కస్టమర్లనూ ఎంపిక చేసుకుని మరీ వల వేస్తారు. వాస్తవానికి వారికి ఇచ్చేది సాధారణ మద్యం అయినప్పటికీ.. ఖరీదైన మద్యం పేరుతో జేబుకు చిల్లు పెడతారు. ఈ బార్లో కేవలం ఈ తరహా మోసాలు చేసేందుకు నలుగురైదుగురు అమ్మాయిలు ఉన్నట్టు సమాచారం. ఈ వ్యవహారం జరుగుతున్నట్టు స్థానిక పోలీసులకు సమాచారం ఉన్నప్పటికీ అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలున్నాయి.

ఈ బార్కు అవసరమైన అనుమతులు కూడా జీవీఎంసీ నుంచి సక్రమంగా లేవు. ఈ బార్ యజమానికి అధికార పార్టీలోని ముఖ్యులందరితోనూ సన్నిహిత సంబంధాలు ఉండటంతో అధికారులు మిన్నకుండిపోతున్నారు. అంతేకాకుండా లంచం ఇస్తున్న సమయంలో రహస్య కెమెరాలతో బంధించిన వీడియోలతో అధికారులను బ్లాక్మెయిల్ చేస్తున్నట్టు సమాచారం. ఇక ఈ బార్లో వాటా కోసం ఏకంగా రూ.2 కోట్ల మేర ఓ కూటమి ఎమ్మెల్యే సమర్పించుకున్నారు. ఇప్పుడు వాటా లేదంటూ ఆ బార్ యజమాని ఖరాఖండిగా తేల్చి చెబుతున్నాడు. అయినప్పటికీ ఆ ఎమ్మెల్యే కిమ్మనకుండా ఉండిపోవడం వెనుక ఏ తతంగం నడిచిందోననే చర్చ జరుగుతోంది.

ఎమ్మెల్యేకు జెల్ల

కూటమి ఎమ్మెల్యే ఈ బార్ కోసం ఏకంగా రూ.2 కోట్ల మేర చెల్లించారు. బార్లో తనకూ వాటా ఇవ్వాలంటూ ఈ చెల్లింపులన్నీ చేశారు. జీవీఎంసీ నుంచి అనుమతులతో పాటు బార్ లైసెన్స్ ఫీజు కూడా ఆయనే చెల్లించారు. బార్లో ఉపయోగించే వివిధ రకాల సామగ్రికి కూడా ఆయనే నగదు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ విధంగా రూ.2 కోట్లకుపైగా చెల్లింపులు పూర్తయిన తర్వాత ఇప్పుడు భాగస్వామ్యం లేదంటూ బార్ యజమాని తేల్చి చెప్పడంతో ఆ ఎమ్మెల్యే పరిస్థితి 'కుడితిలో పడ్డ ఎలుక'లా తయారైంది. బార్ యాజమాని అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో పాటు పలువురు ముఖ్యులతో సన్నిహిత సంబంధాలు ఉండటంతో... సదరు కూటమి ఎమ్మెల్యే మిన్నకుండిపోవాల్సి వచ్చిందనే ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా ఎమ్మెల్యేకు చెందిన పలు వ్యవహారాలు ఆ బార్ యజమానికి తెలిసి ఉండటం కూడా.. అతడు మాట్లాడకపోవడానికి ప్రధాన కారణమనే వాదన బలంగా వినిపిస్తోంది. రూ.2 కోట్లకు పైగా సమర్పించుకున్న ఎమ్మెల్యే కక్కలేక మింగలేక గమ్మున ఉండిపోయారనే ప్రచారం బార్ యాజమాన్యాల సర్కిల్లో వినిపిస్తోంది.

అధికారులకు దడ

ఈ బార్కు అనుమతులు లేవనే ఫిర్యాదులున్నాయి. నిర్మాణం చేయకూడని ప్రాంతంలో చేశారనే విమర్శలున్నాయి. అధికారులు తూతూ మంత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. బార్ వైపునకు వెళ్లేందుకు ఇటు జీవీఎంసీ అధికారులు.. అటు పోలీసులు కూడా జంకుతున్నారనే విమర్శలున్నాయి. ఇందుకు ప్రధాన కారణం అధికారులకు లంచాలు ఇస్తూ రహస్యంగా బార్ యజమాని వీడియోలు తీశారనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో ఒకవేళ ఫిర్యాదులపై స్పందిస్తే ఎక్కడ తమ వీడియోలు బయటకు వస్తాయనే ఆందోళన ఉద్యోగుల్లో కనిపిస్తుందనే చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో అక్కడ వ్యవహారాలన్నీ చట్టవిరుద్ధంగా నడుస్తున్నాయనే సమాచారం పక్కాగా ఉన్నప్పటికీ.. అధికారులెవ్వరూ అటువైపు తొంగిచూడకపోవడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది.

పెరిగిన ఓటర్లు 71,643

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల



మహారాణిపేట: జిల్లాలో ముసాయిదా ప్రతిపాదిత ఓటర్ల జాబితా విడుదలైంది. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రస్తుతం ఉన్న ఓటర్ల వివరాలను మంగళవారం జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ఈ ఏడాది జనవరి నాటికి 19,42,593 మంది ఓటర్లు ఉండగా.. ముసాయిదా జాబితాలో 20,14,236 మంది ఉన్నారు. అంటే గతంలో కంటే 71,643 మంది ఓటర్లు పెరిగారు. మొత్తం మీద 3.90 శాతం పెరిగింది. బుధవారం నుంచి వచ్చే నెల 28వ తేదీ వరకు ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం కొత్తగా పేర్లు నమోదు చేసుకోవడం, తొలగింపులు, సవరణ చేపడతారు. క్లెయిమ్లు, అభ్యంతరాల పరిష్కారానికి డిసెంబర్ 24వ తేదీ వరకు గడువు ఉంది. తుది ఓటర్ల జాబితాను వచ్చే ఏడాది జనవరి 6న ప్రచురిస్తారు. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తయిన వారిని ఓటర్లుగా నమోదు చేస్తారు.

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	మొత్తం	జనవరి	పెరిగింది	ఇతరులు
భీమిలి	1,78,547	1,85,404	3,63,965	3,51,462	12,503	14
తూర్పు	1,42,424	1,49,565	2,92,009	2,76,523	15,486	20
దక్షిణ	1,06,664	1,10,537	2,17,233	2,17,233	7,102	32
ఉత్తర	1,40,330	1,44,515	2,84,868	2,74,760	10,108	23
పశ్చిమ	1,05,269	1,08,355	2,13,636	2,06,943	6,693	12
గాజువాక	1,67,355	1,66,737	3,34,104	3,23,672	10,433	12
పెందుర్తి	1,53,006	1,55,410	3,08,421	2,99,103	9,318	05

డిసెంబర్ 7న ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశం డిసెంబర్ 7న నిర్వహిస్తున్నట్లు అలుమ్ని అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావు తెలిపారు. మంగళవారం ఏయూ అలుమ్ని అసోసియేషన్ సమావేశ మందిరంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది అలుమ్ని సమావేశానికి ముఖ్య అతిథిగా ఎల్ అండ్ టీ గ్రూప్ చైర్మన్ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్, ప్రత్యేక అతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎస్.వి.ఆదినారాయణరావు హాజరవుతారని చెప్పారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశానికి సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. సమావేశంలో అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ కె.కుమార్రాజా, రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు, డాక్టర్ ఎస్.కె.ఇ అప్పారావు, ఆకుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అలుమ్ని పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య శశిభూషణరావు, ప్రతినిధులు

జీవీఎంసీకి రాష్ట్ర స్థాయి అవార్డు

మహారాణిపేట: 2023–24వ సంవత్సరానికి గాను పీఎం స్వనిధి పథకాన్ని అమలు పరచడంలో జీవీఎంసీకి రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ అవార్డును రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ చేతుల మీదుగా జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అందుకున్నట్టు జీవీఎంసీ యూసీడీ పీడీ సత్యవేణి తెలిపారు. జీవీఎంసీ పరిధిలో పీఎం స్వనిధి పథకంలో లోన్లు మంజూరుకు గాను 20,697 దరఖాస్తులు రిజిస్టర్ చేశామని, వాటిని అమలు పరచడంలో యూసీడీ విభాగం సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరిచారని పేర్కొన్నారు.



మంత్రి నుంచి అవార్డు స్వీకరిస్తున్న కమిషనర్

510 బాణసంచా దుకాణాలకు అనుమతి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో 510 దీపావళి దుకాణాలకు అధికారులు అనుమతి ఇచ్చారు. దుకాణాలు ఏర్పాటుకు 536 దరఖాస్తులు రాగా.. వాటిలో 510 దుకాణాలకు అనుమతించినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. మిగిలిన వాటిలో 16 పరిశీలనలో ఉన్నాయి. 10 దరఖాస్తులను తిరస్కరించారు. అనుమతుల కోసం దరఖాస్తుదారుల నుంచి జీవీఎంసీకి రూ.2,73,500 ఆదాయం సమకూరింది. ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలో 90, గాజువాక ఆదర్శ్ మైదానంలో 50, అనకాపల్లి ఎన్టీఆర్ మైదానంలో 40, కొమ్మాది ఓజోన్ వ్యాలీలో 33, ఎంవీపీ ఏఎస్ రాజా మైదానంలో 32, గోపాలపట్నంలో 31తో పాటు మిగిలిన ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటుకు అనుమతిచ్చారు.

గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ కళాశాలలో బోటనీ, జువాలజీ, బయోటెక్నాలజీ విభాగాల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో ఫస్ట్ క్లాస్ పీజీ కలిగి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల వారు నవంబర్ 2న జరిగే ఇంటర్వ్యూలు హాజరుకావాలన్నారు. వివరాలకు 7981863714లో సంప్రదించవచ్చు.

అడ్డగోలు బదిలీకి ఆన్లైన్ పేమెంట్లు

- పంచాయతీరాజ్లో లోపించిన పారదర్శకత
- ఉమ్మడి విశాఖలో ఈవోఆర్డీ బదిలీల్లో అక్రమాలు
- జెడ్పీ సీఈవో విచారణలో వెలుగులోకి వస్తున్న కొత్త అంశాలు



మహారాణిపేట: పంచాయతీరాజ్లో అడ్డగోలు బదిలీల వ్యవహారం చిచ్చు రేపుతోంది. ఆన్లైన్ వేదికగా లంచాలకు తెరలేపడంతో ఈ వ్యవహారం ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని ఆందోళన రేగుతోంది. ఉమ్మడి విశాఖ కేంద్రంగా పంచాయతీరాజ్లో కార్యనిర్వహణాధికారి అండ్ రూరల్ డెవలప్మెంటు (ఈవోపీఆర్ అండ్ ఆర్డీ) బదిలీలు జరిగిన సంగతి తెలిసిందే. బదిలీల్లో పారదర్శకత లోపించింది. ఎవరైతే భారీగా డబ్బులు సమర్పించుకున్నారో వారికి కావాల్సిన చోట పోస్టుంగులు దక్కాయి. ఈ వ్యవహారంపై గత నెలలో సాక్షి దిన పత్రికలో వరుస కథనాలు ప్రచురితం కావడంతో అధికారులు ఉలిక్కిపడ్డారు. కలెక్టర్ ఈ విషయాన్ని సీరియస్గా తీసుకుని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తిని విచారణ అధికారిగా నియమించారు. విచారణలో అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న ఈవోపీఆర్ అండ్ ఆర్డీల జాబితా ఇవ్వాలని సీఈవో కోరిన విషయం తెలిసిందే. ఈ జాబితా ఇస్తే తమ లొసుగులు బయటపడతాయన్న కారణంగా సాంకేతిక కారణాలు చూపిస్తూ జాబితా ఇవ్వడానికి నాన్చుతున్నారు. ఇదిలావుండగా వాటాల్లో తేడాలు వచ్చి విభేదాలు తలెత్తడంతో ఆన్లైన్ చెల్లింపుల వ్యవహారం బయటకు వచ్చింది. ఫోన్ పే, గుగుల్ పే ద్వారా జరిగిన లావాదేవీలను కొంతమంది బయట పెట్టడానికి సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. బదిలీకి ముందు కొంత..తరువాత కొంత డబ్బు ఇచ్చేందుకు ఉద్యోగులు ఒప్పందం కుదుర్చుకున్నారు. సాక్షి వరుస కథనాలతో కోరుకున్న చోటుకు బదిలీ అయిన ఉద్యోగులు మిలిగిన డబ్బులు ఇవ్వకపోవడంతో పంచాయతీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. కొంతమంది ఫోన్లు చేసి బెదిరింపులకు దిగుతున్నట్టు తెలిసింది. ఈ వ్యవహారం చినికి చినికి గాలి వానగా మారడం ఆన్లైన్ పేమెంట్ చేసిన ఉద్యోగులు స్క్రీన్ షాట్లతో సంబంధిత అధికారులపై ఎదురు తిరుగుతున్నట్టు సమాచారం. జెడ్పీ సీఈవో మరింత పకడ్బందీగా విచారణ జరిపితే సూత్రధారులెవరో..పాత్రధారులెవరో బయటపడతారన్న చర్చ నడుస్తోంది.

మూర్తియాదవ్ నీ బాగోతం బయటపెడతా

నువ్వొక బ్లాక్మెయిలర్వి

- నాపై తప్పుడు ఆరోపణలు చేసిన నీపై పరువు నష్టం దావా వేస్తా..
- హెచ్చరించిన డిప్యూటీ మేయర్ శ్రీధర్



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

డాబాగార్డెన్స్: 'జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి బ్లాక్ మెయిలింగ్ కోసమే ప్రెస్మీట్లు పెట్టి బెదిరిస్తుంటాడు. నాపై అవాస్తమైన ఆరోపణలు చేస్తూ.. నా పరువు ప్రతిష్టలను దెబ్బతీస్తున్న అతనిపై పరువు నష్టం దావా వేస్తాను.' అని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ హెచ్చరించారు. అక్రమ వసూళ్ల కోసం బాణసంచా దుకాణాలను సైతం ఆయన వదిలిపెట్టలేదని ధ్వజమెత్తారు. నగరంలోని ఓ హోటల్లో మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ అల్లా కృష్ణతో కలసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "కొన్నేళ్లుగా మూర్తి యాదవ్ నాయకులపై అవాస్తవాలతో అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తూ.. కోట్ల రూపాయలు ఆర్జించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. జీవీఎంసీలో కింది స్థాయి నుంచి ఐఏఎస్ అధికారి వరకు అతని బాధితులు ఉన్నారు. ఏయూ మైదానంలో బాణసంచా విక్రయాలపై వేసి న కేసు విషయంలో హైకోర్టు అతన్ని తీవ్రంగా మందలించింది. తిరిగి తమపై తప్పుడు ఆరోపణలు చేస్తూ.. బాణసంచా వ్యాపారులపై పోలీస్ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నాడు. ఓ మహిళ డాక్టర్ను వేధించి ఆమె నుంచి లక్షలాది రూపాయలు దోచుకున్నాడు. చిరువ్యాపారులను కూడా వేధింపులకు గురిచేస్తున్నాడు. వార్డులోని మహిళలకు ఉద్యోగాల ఆశ చూపి రూ.30లక్షలు, 90 తులాల బంగారం దోచుకున్నాడు. జీవీఎంసీ పార్కు స్థలాలని ఆనాడు చెప్పి.. నేడు ఆ స్థలాలను కబ్జా చేస్తున్నాడు. చివరకు సొంత చెల్లెలను కూడా ఇబ్బంది పెట్టాడు. ఈ విషయంలో అతనిపై ఆనందపురం పోలీస్స్టేషన్లో కేసు నమోదై ఉంది. అతని వార్డులో రూ.20 కోట్ల విలువైన స్థలాలను కబ్జా చేసి ఆధీనంలో పెట్టుకున్నాడు." అని శ్రీధర్ ఆరోపించారు. ఇప్పటికే అతనిపై హైకోర్టులో 16 కేసులు నడుస్తున్నాయని, 300కు పైగా వాయిదాలు జరిగాయన్నారు. త్వరలో బాధితులతోనే అతని బాగోతం బయట పెడతానని చెప్పారు.

'దీపావళి దుకాణాలకు సంబంధించి గతంలో ఎక్కడి వారు అక్కడే వ్యాపారం చేసుకునే వారు. ఆ తర్వాత సెంట్రల్ పార్క్ చుట్టూ విక్రయించేవారు. అనంతరం ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్కు మార్చారు. గతేడాది ఆరుగురు కమిటీ సభ్యులతో కలిసి వ్యాపారం చేసుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ.. పీతల మూర్తి బినామీ రామచంద్రరావు, సిరాజ్లు నలుగుర్ని తప్పించి మొత్తం వ్యాపారం చేసుకుందామని దుర్బుద్ధి చూపారు. దీంతో మిగిలిన నలుగురు నా వద్దకు వస్తే న్యాయం చేయాలనే ఉద్దేశంతో వారి మధ్య సయోధ్య కుదిర్చాం.. గతేడాది దుకాణాల ఏర్పాటుకు రూ.98 లక్షల వరకు ఖర్చయింది. ఈ ఏడాది ఆ ఖర్చు రూ.1.10 కోట్ల వరకు అవుతుంది.' అని శ్రీధర్ వివరించారు. జనావాసాల మధ్య పీతల మూర్తి బినామీ రామచంద్రరావు బాణసంచా విక్రయించేవాడని, ఈ విషయంలో హైకోర్టు చీవాట్లు పెట్టిందని గుర్తు చేశారు. దుకాణదారులు తనకు చెక్కులు ఇచ్చినట్టు ఆరోపించిన మూర్తి యాదవ్.. వాటిని నిరూపించాలన్నారు. అల్లా కృష్ణ మాట్లాడుతూ డిప్యూటీ మేయర్పై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మూర్తి యాదవ్ చేసిన ఆరోపణలు నిరూపిస్తే.. మీడియా సమావేశంలో ఏం చేయమన్నా అందుకు తాను సిద్ధమేనన్నారు. దీపావళి దుకాణాలకు సంబంధించి శ్రీధర్కు ఏ మాత్రం సంబంధం లేదన్నారు. అధికారంలో ఉన్నది మీ ప్రభుత్వమేనని.. చేసిన ఆరోపణలపై విచారణ చేయించుకోవాలని సవాల్ విసిరారు.

రెవెన్యూ సేవలు విస్తృతం

మహారాణిపేట: రెవెన్యూ సేవలను మరింత విస్తృతం చేయాలని.. అధికారులు, సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. రామాటాకీస్ జంక్షన్ వద్ద గల అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం విశాఖ డివిజన్ రెవెన్యూ కాన్ఫరెన్స్ జరిగింది. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని, ప్రజలకు సత్వరమే సేవలను అందించాలని సూచించారు. కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు జవాబుదారీతనం ఉండేలా పని చేయాలని పేర్కొన్నారు. ధ్రువీకరణ పత్రాల జారీ, ఏవైనా ప్రజా సమస్యలపై విచారణ, ఇతర ప్రక్రియల్లో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవో పి.శ్రీలేఖ, ప్రత్యేక ఉప కలెక్టర్లు, తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలు, సర్వేయర్లు, పాల్గొన్నారు.

సింహాచలం దేవస్థానంలో ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో జీడిపప్పు చోరీ చేసిన ఇద్దరు ఉద్యోగులను ఈవో వి.త్రినాథరావు సస్పెండ్ చేశారు. సింహగిరిపై ప్రసాదాల తయారీ సెక్షన్‌లో లడ్డూలో కలపాల్సిన జీడిపప్పును జూనియర్ అసిస్టెంట్ పట్నాల సూర్యనారాయణ, పిండిమిల్లు అసిస్టెంట్ కాశీ పైడిరాజు చోరీ చేశారు. ఈ వ్యవహారంపై ఈవో విచారణ జరిపి.. ఇద్దరు ఉద్యోగులు చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

విశాఖ నుంచి స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం నుంచి దానాపూర్, భువనేశ్వర్‌లకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖ–దానాపూర్(08520) స్పెషల్ నవంబరు 4 ఉదయం 9.10 గంటలకు విశాఖలో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు దానాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో (08519) దానాపూర్‌లో నవంబరు 5 మధ్యాహ్నం 12.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు బుధవారం సాయంత్రం 3.45 గంటలకు విశాఖ చేరుకుంటుంది. విశాఖ–భువనేశ్వర్ (08536) స్పెషల్ ప్రతీ రోజు మధ్యాహ్నం 12 గంటలకు విశాఖలో బయల్దేరి అదేరోజు రాత్రి 7.45 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో (08535) భువనేశ్వర్‌లో ప్రతీ రోజు రాత్రి 10.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.45 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు నవంబరు 15వ తేదీ వరకు నడుస్తాయి.

భళా..బాల

- ముగిసిన 'ఫ్యూచర్ ఆన్–2024'
- ఆలోచింపజేసిన నమూనాలు
- సత్తాచాటిన మధురవాడ, సబ్బవరం గురుకుల విద్యార్థులు



జోనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో విజేతలతో అతిథులు

మధురవాడ: బాల మేధావుల సృజనాత్మకత వెల్లివిరిసింది. కొమ్మాది రిక్షా కాలనీ(మధురవాడ)లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వేదికగా 'ఫ్యూచర్ ఆన్–2024'పేరుతో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జోనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ మంగళవారం ముగిసింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో జరిగిన పోటీల్లో 33 గురుకులాలకు చెందిన 150 మంది విజేతలుగా నిలిచి జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు రూపొందించిన 88 నమూనాలు ఇక్కడ కొలువు దీరాయి. ఆతిథ్యం ఇచ్చిన రిక్షా కాలనీలోని అంబేడ్కర్ గురుకుల సీవోఈ ఐదు, సబ్బవరం గురుకుల పాఠశాల 3 బహుమతులు గెలుచుకుని సత్తా చాటాయి.

రాష్ట్రస్థాయి పోటీలకు 18 నమూనాలు

జూనియర్, సీనియర్ విభాగాల్లో 8 చొప్పున, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్‌ల నుంచి రెండు.. మొత్తంగా 18 నమూనాలను న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన ఏయూ ప్రొఫెసర్లు ఎంపిక చేశారు. నవంబర్‌లో పల్నాడు జిల్లా ఆర్.కె. పురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు నమూనాలను ప్రదర్శించనున్నారు. ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ జాయింట్ సెక్రటరీ ఎ.మురళీకృష్ణ విజేతలకు బహుమతులు, ధ్రువీకరణపత్రాలు అందజేశారు. డీజీవో రూపావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్ఐవో మురళీధర్, ప్రిన్సిపాల్ శాంతికుమారి, పాఠశాల కమిటీ చైర్మన్ బగాది జగదీశ్వరరావు, డీసీవోలు బాలాజీ నాయక్, ఫ్లోరెన్స్ పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి విజేతలు వీరే..

సీనియర్స్ విభాగంలో 'సైన్స్' విజేతగా పి.గౌతమ్, పార్వతీపురం(అన్‌పొల్యూటెడ్ పేపర్ అండ్ కప్స్ మేకింగ్), రన్నరప్‌గా రమణమ్మ, హర్షిత, సీవోఈ, మధురవాడ (ఐవోటీ బేస్డ్ ఫుడ్ పాయిజనింగ్ డిటెక్టింగ్ సిస్టం) నిలిచారు. సోషల్ విభాగంలో విజేతగా పి.లక్ష్మిప్రియ, పి.త్రివేణి, కొక్కిరాపల్లి (డిజాస్టర్ మేనేజ్‌మెంట్), రన్నరప్‌గా స్ఫూర్తి, యశోద, ఎచ్చెర్ల (ఆర్గానిక్ ఫార్మింగ్), మ్యాథ్స్ విభాగంలో విజేతగా రాజేశ్వరి, హనిహర్షిత (కార్టీసియన్ ప్లేన్), రన్నరప్‌గా ఆకాష్, దుర్గాప్రసాద్, సీవోఈ, మధురవాడ (యూజ్ ఆఫ్ మ్యాథమెటికల్ ఇన్ వాచ్ భారత్), ఐసీటీ విభాగంలో విజేతగా రూడా ఇవాంజలిన్, ప్రవల్లిక, సాయిప్రియ (ఐవోటీ బేస్డ్ కార్ పార్కింగ్ సిస్టం), రన్నరప్‌గా చిరంజీవి, కుమార్, కొల్లివలస (హార్వెస్టింగ్ క్రాప్ ప్రొటెక్టర్) గెలుపొందారు. ఆర్ట్స్ విభాగంలో విజేతగా కార్తీక్, ఎం.బాలు(శ్రీకృష్ణాపురం), రన్నరప్‌గా దుర్గాప్రవీణ్, సుధీర్(దేవరాపల్లి), క్రాఫ్ట్ విభాగంలో విజేతగా విజయ్‌కుమార్, తేజ, సాగర్(బాడంగి), రన్నరప్‌గా దీపికాదేవి(మేహాద్రిగెడ్డ)నిలిచారు.

- జూనియర్స్ విభాగంలో 'సైన్స్'విజేతగా కె.శివకుమార్, ఎ.నవదీప్, సబ్బవరం (వెర్టికల్ ఫార్మింగ్), రన్నరప్‌గా సందీప్, దుర్గాప్రసాద్, దుప్పలవలస (ఓల్డేజ్ పీపుల్ సర్వింగ్ వీల్ చైర్), సోషల్ విభాగంలో విజేతగా శ్యామల, మోహనప్రియాంక, సీవోఈ, మధురవాడ (ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్), రన్నరప్‌గా భవ్యశ్రీ, కొమరాడ (గిరిజనుల సమస్యలు), మ్యాథ్స్ విభాగంలో విజేతగా తనూజ, నిస్సీ, సీవోఈ, మధురవాడ (ప్రోపర్టీస్ ఆఫ్ ది సర్కిల్స్), రన్నరప్‌గా రిత్విక, అశ్విన్, తాళ్లపాలెం (మ్యాథమెటిక్స్ ఇన్ అవర్ డైలీ లైఫ్) నిలిచారు. ఐసీటీ విభాగంలో విజేతగా విశ్వనాథ్, అశోక్, సబ్బవరం (హ్యూమన్ హెల్త్, ట్రాఫిక్ అలర్ట్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ సిస్టం), రన్నరప్‌గా సంజన, వియ్యంపేట (ఎఫెక్టివ్ ట్రైన్ ప్లాట్‌ఫార్మ్ క్రాసింగ్ సిస్టం), ఆర్ట్ విభాగంలో విజేతగా ప్రసన్నకుమార్, దుర్గారావు(దుప్పలవలస),రన్నరప్‌గా నిఖిల్, మోహనరావు(కొల్లివలస), క్రాఫ్ట్ విభాగంలో విజేతగా మున్న, సంపత్ వినయ్(సబ్బవరం), రన్నరప్‌గా హిమవర్షిణి(చీపురుపల్లి) గెలుపొందారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

సీతమ్మధార: ఎన్ఏడీ ఫ్లై ఓవర్‌పై మంగళవారం రాత్రి పన్నెండు గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీని ఢీకొట్టిన ఘటనలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకుల్లో ఒక యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి గాయాలయ్యాయి. ఘటనలో బైక్ లారీ కిందకి వెళ్లిపోయింది. గాయపడ్డ యువకుడి పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం అతన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు

హిమాచల్‌ప్రదేశ్ ఇన్నింగ్స్ గెలుపు

- ఆంధ్రకు మూడో పరాజయం

విశాఖ స్పోర్ట్స్: రంజీ ట్రోఫీ ఎలైట్ బి గ్రూప్‌లో భాగంగా ఆంధ్రతో జరిగిన మ్యాచ్‌లో హిమాచల్‌ప్రదేశ్ ఇన్నింగ్స్ 38 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఎలైట్ బీ గ్రూప్‌లో ఎనిమిది జట్లు పోటీపడుతుండగా ఈ విజయంతో హిమాచల్‌ప్రదేశ్(14 పాయింట్లతో) రెండో స్థానానికి చేరుకోగా ఆంధ్ర(0 పాయింట్లు) ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ పరాజయాలతో చివరి స్థానానికి దిగజారింది. వైఎస్ఆర్ స్టేడియంలో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌ను 344 పరుగులకు ముగించగా... హిమాచల్ ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 500 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లో 118 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు మహీప్(5), అభిషేక్(2) 14 పరుగులకే పెవిలియన్‌కు చేరగా మనీష్(23), కెప్టెన్ రషీద్(34), హనుమవిహారీ(20), అశ్విన్‌హెబ్బర్(17) మాత్రమే కాస్త రాణించారు. జట్టు స్కోర్ 116 పరుగుల వద్ద భరత్, శశికాంత్, లలిత్‌మోహన్ డకౌట్‌గా పెవిలియన్‌కు చేరారు. గలేటియా ఐదు వికెట్లు తీయగా మయాంక్ నాలుగు వికెట్లు తీశాడు. రిషిధావన్ (హిమాచల్ ప్రదేశ్) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి 195 పరుగులతో పాటు మూడు వికెట్లను తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

173 మంది పోలీసులకు రివార్డులు

విశాఖ సిటీ: నగర పోలీస్ శాఖలో ఉత్తమ ప్రతిభ చూపించిన 173 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి సీపీ శంఖబ్రత బాగ్చి మంగళవారం రివార్డులు అందజేశారు. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడం, బాంగ్ చాక్లెట్లు విక్రయిస్తున్న వారి అరెస్టు, చోరీ కేసుల్లో సొత్తు రికవరీ, నిందితుల అరెస్ట్, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరస్తుల పట్టివేత, ఇలా పలు కేసుల దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన హోంగార్డు నుంచి సీఐ వరకూ గల సిబ్బందికి రివార్డు మంజూరు ఆర్డర్లను అందజేశారు.

పోలీసులకు పదోన్నతులు

విశాఖ సిటీ: పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న పలువురికి పదోన్నతులు లభించాయి. నగర పోలీస్ కమిషనరేట్‌కు చెందిన సీనియర్ అసిస్టెంట్‌కు ఆఫీస్ సూపరింటెండెంట్‌గా, అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌కు రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా, ఒక ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్‌కు అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా, ఒక ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్‌కు ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించారు. నలుగురిని మంగళవారం పోలీస్ సమావేశ మందిరానికి కుటుంబ సభ్యులతో ఆహ్వానించి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పదోన్నతికి సంబంధించిన ర్యాంకులతో పాటు పోస్టింగ్ ఆర్డర్లను స్వయంగా అందజేశారు. డీసీపీ–1 అజితా వేజెండ్ల, డీసీపీ–2 మేరీ ప్రశాంతి, డీసీపీ(క్రైం) లతామాధురి, ఆర్మ్‌డ్ రిజర్వ్ అధికారులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కాలేజీకి 400 బెడ్స్ విరాళం



పూర్వ విద్యార్థి పూర్ణచంద్రరావును సన్మానిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో చదువుకుని ఉన్నతంగా ఎదిగిన టి.పూర్ణచంద్రరావు, ఎం.ఎస్.పి.రావు కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించారు. తాము చదువుకునే సమయంలో తమకు ఆశ్రయం కల్పించిన ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్ బ్లాక్–6లో విద్యార్థులకు ఉపయుక్తంగా 400 మంచాలను తయారు చేయించి ఇచ్చారు. ఇందుకోసం రూ.16 లక్షలు ఖర్చు చేశారు. వీరిని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అభినందించారు. మంగళవారం తన కార్యాలయంలో పూర్ణచంద్రరావును సత్కరించారు.

ఉద్యోగాల పేరిట చీటింగ్



బాధితులు ఫిర్యాదు చేసింది ఈమె పైనే..

అల్లిపురం: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కర్రి పార్వతి నాగ శ్రీదేవి అనే మహిళ తమను మోసం చేసిందని బాధితులు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికి మంగళవారం ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాలివీ.. స్వర్ణభారతి స్టేడియం సమీపంలోని ఫెయిర్ లింక్ జాబ్ కన్సల్టెన్సీ ప్రతినిధి శ్రీదేవి కొన్నాళ్ల కిందట నిరుద్యోగుల నుంచి లక్ష నుంచి రూ.15 లక్షల వరకు వసూలు చేసింది. ఆపై తప్పించుకుని తిరుగుతోంది. ఉద్యోగాలు మాట పక్కన పెడితే.. తమ డబ్బులు ఇచ్చేయాలని బాధితులు అడుగుతుంటే తనకు పోలీస్ శాఖలో పెద్దవాళ్లతో పరిచయాలు ఉన్నాయంటూ బెదిరిస్తోంది. ఇలా సుమారు 50 మంది నుంచి డబ్బులు వసూలు చేసిందని బాధితులు ఆరోపించారు. ఆన్‌లైన్ యాప్‌లో ఉద్యోగాల పేరిట వచ్చిన ప్రకటన చూసి ఆమెను సంప్రదించామని తెలిపారు. నిందితురాలు చిరునామాలు మారుస్తూ మ్యారేజ్ లింక్స్, ఎయిర్ లింక్ కన్సల్టెన్సీ, ఏ టూ జెడ్ కన్సల్టెన్సీ పేరిట మోసాలకు పాల్పడుతోందన్నారు. ఐదు జిల్లాల్లో నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని శ్రీదేవి మోసాలకు పాల్పడుతోందని, తమకు న్యాయం చేయాలని బాధితులు సీపీకి విజ్ఞప్తి చేశారు.

ప్రకృతి సంపద ప్రజలందరికీ చెందాలి

- ఉచిత ఇసుక విషయంలో అక్రమాలను సహించం
- మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

మహారాణిపేట : ప్రకృతి ప్రసాదించిన వనరులను ప్రతి ఒక్కరికీ చెందేలా చూసుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల మైనింగ్ అధికారులు, క్వారీ నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మైనింగ్ వ్యవస్థను ప్రక్షాళన చేసి మెరుగైన పాలనకు శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. క్రషర్ యజమానులు, మైనింగ్ కంపెనీల యజమానులతో సీనరేజి వసూలు చేసే సంస్థలు సఖ్యతతో నడుచుకోవాలని ఆదేశించామన్నారు. పెత్తనం చేయాలని చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఉత్తరాంధ్రలో అమూల్యమైన ప్రకృతి వనరులున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రజలకు ఉచితంగా ఇసుక అందించాలనే ఉద్దేశంతో జులై 8న పాలసీ ప్రకటించినా.. వర్షాల వల్ల రాష్ట్రంలో ఇసుక తవ్వకాలను ప్రారంభించలేని పరిస్థితి నెలకొందన్నారు. దాన్ని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో ఇసుక కొరతను నివారించేందుకు గోదావరి జిల్లాల్లో ఐదు రీచుల్ని ప్రత్యేకంగా కేటాయించామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

రాష్ట్రంలో బెల్టు షాపుల నిర్వహణ, కల్తీ మద్యం అమ్మకాలపై కఠిన చర్యలుంటాయని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులతో మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష నిర్వహించారు. ఎన్ని ఇబ్బందులున్నా అత్యంత పారదర్శకంగా మద్యం షాపులు కేటాయించామన్నారు. నాణ్యమైన మద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే గంజాయిని పూర్తి నిర్మూలనకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించుతున్నామన్నారు.

అత్యాధునిక పోలీసింగ్‌కు చర్యలు

- ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ కెమెరాల ఏర్పాటుకు కసరత్తు
- నేర సమీక్ష సమావేశంలో సీపీ శంఖబ్రత బాగ్చి



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: విశాఖలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ కోసం అత్యాధునిక పోలీసింగ్‌కు చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. పోలీస్ సమావేశ మందిరంలో మంగళవారం ఉన్నతాధికారులతో నేర సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో రహదారి భద్రత కోసం ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ కెమెరాల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. విశాఖలో కొన్ని ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఈ విధానాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం ఢిల్లీలో జరిగిన ట్రాఫిక్ ఇన్‌ఫ్రా టెక్ ఎక్స్‌పో–2024కు హాజరైన అధికారులు ఇచ్చిన పీపీటీ ప్రదర్శనను వీక్షించారు. నగరంలో అత్యాధునిక పోలీసింగ్‌కు ఉపయోగపడే పరికరాలను పరిశీలించి, తదుపరి చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వారితో నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాంను వివరించారు. నేట్ గ్రిడ్ ఇన్వెస్టిగేషన్ పోర్టల్‌ను వివరించి పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రౌడీ షీటర్లు, వారిపై పెడుతున్న నిఘా చర్యలపై ఆరా తీశారు. తన నంబర్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సమస్యాత్మక ప్రాంతాల్లో సమస్యలకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. పోక్సో కేసులపై ఆరా తీసి.. నగరంలో క్రైం రేటు తగ్గు ముఖం పట్టేలా రాత్రి పూట నిఘా పటిష్టం చేయాలన్నారు. డీసీపీ–1 అజితా వేజెండ్ల, డీసీపీ–2 డి.మేరి ప్రశాంతి, డీసీపీ(క్రైం) కె.లతా మాధురి, ట్రాఫిక్ ఉన్నతాధికారులు, ఏడీసీపీలు, ఏసీపీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పలు సంస్థల్లో సౌర విద్యుత్ ఏర్పాటు

ముందుకొచ్చిన ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా



సౌర ప్రాజెక్టుకు సమ్మతిని తెలియజేస్తూ కలెక్టర్‌కు లేఖ అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

మహారాణిపేట: పలు సంస్థల్లో సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడానికి ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ ముందుకొచ్చింది. విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్), ప్రభుత్వ మానసిక వైద్యశాల, ఉన్నత పాఠశాల (చంద్రంపాలెం)లో సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేయడానికి సమ్మతి తెలియజేసింది. దీనికయ్యే నిధులను సమకూర్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. మొత్తం రూ.70 లక్షల వ్యయంతో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. ప్రాజెక్టు అమలు కోసం ఆమోదిత ప్రతిపాదనలను మంగళవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా వైజాగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవీంద్రనాథ్, ఎఎంఎన్ఎస్ ఇండియా హెడ్–హెచ్.ఆర్, అడ్మిన్ డీఎస్ వర్మ అందజేశారు. ఇటీవల కేజీహెచ్, మహిళల కోసం ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి, రెండు పాఠశాలలు, జ్ఞానపురంలోని వృద్ధాశ్రమం, నగరంలోని ఇతర ఆస్పత్రుల్లో 300 కె.వి. సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

విశాఖలో ప్రభుత్వ భూముల వేలం సరికాదు

- రుషికొండ ప్యాలెస్‌ను అదానీకి ధారాదత్తం చేస్తే సహించం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె లోకనాథం

డాబాగార్డెన్స్: మధురవాడ, కూర్మన్నపాలెం, చిన ముషిడివాడలోని భూములను వీఎంఆర్డీఏ ద్వారా వేలం వేయడాన్ని తక్షణం నిలుపుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. జగదాంబ జంక్షన్ సమీపంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.గంగారావు, జిల్లా కమిటీ సభ్యుడు వి.కృష్ణారావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. విశాఖలో ప్రభుత్వ భూములకు రాష్ట్ర ప్రభుత్వం ట్రస్టీగా ఉండి రక్షించకుండా భక్షించేందుకు చూడటం సరికాదని మండిపడ్డారు. గత ప్రభుత్వం విశాఖలో ఉండే విలువైన భూములను అమ్మకానికి పెట్టినప్పుడు చంద్రబాబు, పవన్ కల్యాణ్ గగ్గోలు పెట్టారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తోంది ఏంటని ప్రశ్నించారు. విశాఖను ఆర్థిక రాజధానిగాఅభివృద్ధి చేస్తామని చెబుతూ.. ప్రభుత్వ భూములన్నీ అమ్మేస్తే ఆర్థిక రాజధాని కాదు.. అదానీ రాజధానిగా మారుతుందని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ భూములు అదానీపరం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం ఒప్పందాలు చేసుకున్నట్టు కనిపిస్తోందన్నారు. అదానీ గంగవరం పోర్టు విస్తరణకు 250 ఎకరాల భూమి అవసరమని చంద్రబాబును కోరినట్టు తెలిసిందన్నారు. కానీ 2 వేల ఎకరాల భూమిని కేటాయిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయన్నారు. అప్పికొండ వద్ద ఉన్న 25 ఎంజీడీల నీటిని శుద్ధి చేసే డీశాలిటేషన్ ప్లాంట్‌ను అదానీకి కట్టబెట్టారని.. ఫలితంగా జీవీఎంసీ రూ.200 కోట్ల ఆదాయం నష్టపోతుందన్నారు. జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం లేకుండా చంద్రబాబు ఏకపక్షంగా ఇవ్వడాన్ని సీపీఎం ఖండిస్తోందన్నారు. రుషికొండ వద్ద ఉన్న భవనాలను అదానీకి కట్టబెట్టేందుకు చూస్తున్నారని, దీన్ని పర్యాటకానికి, ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు.

పనిమానేస్తానంటే దొంగతనం అంటగట్టారు

- ఆక్సిజన్ టవర్స్‌లో ఇంటి యజమాని ప్రియాంక వేధింపులు
- విచారణ పేరుతో మహిళ కాలు విరిచేసిన పోలీసులు?
- తోటి పనివాళ్లు, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన



ధర్నా చేస్తున్న సీఐటీయూ శ్రేణులు

సీతమ్మధార: 'ఇంట్లో పనిచేయలేనని చెప్పిన పాపానికి దొంగతనం అంటగట్టారు. యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు అరెస్టు చేసి చావబాదారు.. కాలు విరిగిపోయింది. ఇదేనా మానవత్వం.. ఇంటి యజమానిపై తక్షణం చర్యలు తీసుకోవాలి.. పోలీసులను కఠినంగా శిక్షించాలి' అని తోటి పనివాళ్లు, సీఐటీయూ నేతలు ఆందోళనకు దిగారు. ఆక్సిజన్ టవర్ వద్ద మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ బాధిత మహిళతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. బాధితురాలు, సీఐటీయూ నేతలు, తోటి పనివాళ్లు చెప్పిన వివరాల ప్రకారం.. ఆక్సిజన్ టవర్స్ 8వ ఫ్లోర్ బి బ్లాక్ ఫ్లాట్ నంబర్ 20లో డాక్టర్ వేమూరి ప్రియాంక తన కుమార్తెతో కలిసి నివాసముంటున్నారు. ప్రియాంక ఇంట్లో పని చేసేందుకు వారం రోజుల క్రితం మద్దిలపాలేనికి చెందిన వితంతువు సంపత్తి గంగ చేరింది. ఇప్పటివరకు ప్రియాంక ఇంట్లో చాలా మంది పనిచేసి మానేశారు. ప్రియాంక ఇంట్లో పనికి చేరవద్దని తోటి పనివాళ్లు గంగకు చెప్పినా.. ఆర్థిక ఇబ్బందులు కారణంగా పనిలో చేరింది. ఐదు రోజుల తరువాత పని ఎక్కువ అవడంతో కష్టంగా ఉంది.. పనిచేయలేనని గంగ చెప్పడంతో ప్రియాంక ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంట్లో నల్ల పూసలు పోయాయని మరుసటి రోజు గంగతో గొడవకు దిగింది. తాను తీయలేదని ఎంత మొరపెట్టుకున్నా వినిపించుకోలేదు. ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఈనెల 26వ తేదీన ప్రియాంక ఫిర్యాదు చేసింది. క్రైం ఎస్ఐ నరవ జగదీష్ కేసు నమోదు చేశారు. గంగను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. నల్లపూసలు దొంగతనం చేసినట్టు అంగీకరించాలని ఒత్తిడి తెచ్చారు. ఒప్పుకోకపోతే కాలు, చెయ్యి విరిచేస్తామని బెదిరించారు. ఇద్దరు కానిస్టేబుల్స్ రెండు కాళ్లు పట్టుకొని, గుండెల పైన కూర్చొని దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో గంగ కాలు విరిగిపోయింది. సంఘటన జరిగి రెండు రోజులైనా విషయం బయటకు రాలేదు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న తోటి పనివాళ్లకు విషయం తెలిసి మంగళవారం ఉదయం 10 గంటలకు ఆక్సిజన్ టవర్స్ బిల్డింగ్ వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. సీఐటీయూ నేతలు సంఘీభావం వ్యక్తం చేశారు. పనిమనిషిని తీవ్రంగా గాయపర్చిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.మణి, మద్దిలపాలెం జోన్ అధ్యక్ష, కార్యదర్శి జెఆర్ నాయుడు, పి.వెంకటరావు, మున్సిపల్ యూనియన్ నాయకులు కుమారి, ఆదినారాయణ, రాజు, శ్రీను డిమాండ్ చేశారు. గంగపై దొంగతనం కేసు పెట్టిన యజమాని ప్రియాంకను అరెస్టు చేయడంతోపాటు బాధితురాలికి రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

ఏసీపీ విచారణ

ఈ సంఘటనపై స్పందించిన నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి విచారణకు ఆదేశించారు. ద్వారకా జోన్ ఏసీపీ రాంబాబు ఆక్సిజన్ టవర్స్‌కు చేరుకుని విచారణ చేశారు. బాధితురాలు గంగ, యజమాని ప్రియాంకలను విచారణ చేసి వివరాలు సేకరించారు. ఆయన వెంట ఎంవీపీ స్టేషన్ సీఐ మురళి, ఎస్ఐలు, పోలీసులు ఉన్నారు. ఇదిఇలా ఉండగా కావాలనే తమ పరువు ప్రతిష్టలకు భంగం కలిగిస్తున్నారని, దీనిపై పూర్తి స్థాయి విచారణ చేయమని పోలీస్ కమిషనర్ కోరినట్లు ప్రియాంక తెలిపారు.